క్లుప్తంగా

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

నాగలాపురం: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించడానికి ముందస్తుగా స్థానిక పోలీసుస్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఐ సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలు వినాయక చవితి ఉత్సవాల్లో విగ్రహ ప్రతిష్టతకు కోసం రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ వెబ్‌సైట్ ద్వారా వినాయక చవితి ఉత్సవాల్లో విగ్రహ ప్రతిష్ట చేయాలకున్న నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని స్థానిక పోలీసుస్టేషన్‌లో సమర్పించాలని ఆయన తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో యువకులు, గ్రామస్తులు అల్లర్లకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓ

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్య కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. స్కూల్ మేళా హెల్ప్ టూ రూరల్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.45 వేల విలువైన విద్యాసామగ్రితోపాటు యూనిఫామ్ ఎంఈఓ భువనేశ్వరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆ సంస్థ సభ్యులు జగదీష్ (అమెరికా), వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయిని శిరీష, సీఆర్‌ఎంటీ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

సత్యవేడు: గర్భిణులు పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సీడీపీఓ దేవకుమారి సూచించారు. కాళమనాయుడుపేట పంచాయతీ పరిధిలోని నీళ్లతొట్టికండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టిహారంపై సీడీపీఓ దేవకుమారి, సూపర్‌వైజర్లు అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ పౌష్టికాహారంతో పలు ప్రయోజనాలున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చెంచులక్ష్మి, మహిళా పోలీస్ చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. గౌరి, ఎస్. మాల, అనీలా, కే. స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం



తహసీల్దార్‌కు చెక్కు అందజేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు గ్రామస్తులు మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 వేలు చెక్కును తహసీల్దార్ సుబ్రమణ్యంకు విరాళంగా అందజేశారు. కృష్ణా జిల్లాలో వరదబాధితుల కోసం రూ.10 వేలు విరాళాన్ని సీఎం సహాయనిధికి అందజేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

హాస్టల్ మరమ్మతుకు రూ.10.90 లక్షలు

నారాయణవనం: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ.10.90 లక్షలు మంజూరైనట్లు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. ఎస్సీ వెల్ఫేర్ డీడీ చెన్నయ్య నిధుల మంజూరు పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ గత వారం హాస్టల్‌ను బీసీ, ఎస్సీ వెల్ఫేర్ డీడీలతో కలిసి సందర్శించామన్నారు. తలుపులు లేని మరుగుదొడ్లు, ఊడిపడుతున్న సీలింగ్ సిమెంట్ పెచ్చులను గుర్తించామని చెప్పారు. వ్యక్తిగతంగా, సంబంధిత డీడీల ద్వారా కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లామని తెలిపారు. ఎస్సీ బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ 10.90 లక్షలను విడుదల చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారన్నారు.

గురువులకు క్రీడా పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈఓ బాబయ్య

నాగలాపురం: మండల కేంద్రంలోని హైస్కూల్ ప్లస్‌లో సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంఈఓలు బాబయ్య, జనార్దనరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉపాధ్యాయులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆందోళనలో రాజీవ్‌నగర్‌వాసులు



బారులు తీరిన రాజీవ్‌నగర్ వాసులు

శ్రీకాళహస్తి: రాజీవ్‌నగర్‌లో సోమవారం జరిగిన సర్వేలో బయట ప్రాంతాల్లో ఉండి సర్వేలో పాల్గొనని వారు ఆందోళన చెందుతున్నారు. దీంతో మంగళవారం వారు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని, తమ వద్ద ఉన్న పత్రాలను అధికారులకు సమర్పించారు. ఎక్కువమంది రావడంతో తహసీల్దార్ ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేసి పేరు, వారి వివరాలను నమోదు చేసుకున్నారు.



- జీఐతో భౌగోళిక గుర్తింపు
- టూరిజం వుడ్ హబ్‌గా ఏర్పాటుకు అవకాశం
- మాధవమాల బొమ్మను వరించనున్న పేటెంట్ హక్కు
- నాబార్డు ద్వారా అధ్యయనం

కొయ్యబొమ్మ బంగారం



మాధవమాల కొయ్యబొమ్మ వార్తల్లోకి ఎక్కింది. అంతర్జాతీయ ఖ్యాతి గడించి, అందలమెక్కడానికి తొలి అడుగు పడింది. భౌగోళిక గుర్తింపు, పేటెంట్ హక్కు, వుడ్ హబ్ రూపకల్పన కోసం అధ్యయనం ప్రారంభమైంది. ఇందుకోసం న్యూఢిల్లీకి చెందిన రీసెల్యూట్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఆ గ్రామంలో పర్యటించి, బొమ్మలను పరిశీలన చేశారు. అన్నీ సవ్యంగా సాగి, అనుకున్నట్లు జరిగితే ఇక వందేళ్ల కొయ్యబొమ్మ బంగారం కానుంది.

ఏర్పేడు: మాధవమాల కొయ్యబొమ్మ అంతర్జాతీయ ఖ్యాతి పొందడానికి సన్నద్ధమవుతోంది. ఈ బొమ్మలకు భౌగోళిక గుర్తింపు కల్పించి, తద్వారా టూరిజం ఉడ్ హబ్‌గా ఏర్పాటుకు న్యూఢిల్లీకి చెందిన రీసెల్యూట్ సంస్థ ప్రతినిధులు మంగళవారం అధ్యయనం ప్రారంభించారు. ఇందులో భాగంగా బాలాజీ వుడ్ కార్వింగ్ ఆర్టిజన్స్ మ్యూచ్‌వలీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను రిజిస్ట్రేషన్ చేయనున్నారు.

చరిత్ర 'వంద'సం

ఏర్పేడు మండలంలోని మాధవమాల కొయ్యబొమ్మలకు సుమారు వంద ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడి కళాకారులు సుమారు శతాబ్దకాలంగా కొయ్యబొమ్మలను తయారు చేస్తున్నారు. మాధవమాలలోని ఆచారి సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వందేళ్ల కిందట రైతులకు కొయ్య నాగళ్లు, పారలకు కొయ్యలు, చిన్నపాటి బొమ్మలు తయారు చేసి, ఇస్తుండేవారు. వారి మరణానంతరం వారి కుమారులు అదే వృత్తిని ఎంచుకున్నారు. ఈ క్రమంలో వారసులు సాంకేతిక పరిజ్ఞానంతో పలు దేవతా మూర్తులు, ధ్వజస్తంభాలు తదితర కొయ్యబొమ్మలను తయారు చేసి, విక్రయిస్తుండేవారు. వారి వద్ద

ప్రదర్శనలతో ప్రపంచఖ్యాతి



బాలాజీ వుడ్ కార్వింగ్‌లో తయారు చేసిన వివిధ దేవతా మూర్తుల బొమ్మలు

అప్పట్లో ఆర్థిక లేమి కారణంగా కళాకారులు కలప కొనుగోలు, పనిముట్ల విక్రయాల కోసం ఇక్కట్లు పడ్డారు. తాము తయారు చేసిన కొయ్యబొమ్మలను విక్రయించేందుకు పట్టణాలకు వెళ్లలేక ఇబ్బందులు పడేవారు. కాలక్రమేణ అక్కడక్కడ పట్టణాల్లో జరిగే ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తూ వచ్చారు. ఇలా కొయ్యబొమ్మలు ప్రపంచ స్థాయి ఖ్యాతి గడించాయి. కళాకారులు ఒక్కొక్కరు పట్టణాలకు వెళ్లలేక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

గుండరాయనిమిట్ట, మాధవమాల ఎస్సీకాలనీ తదితర గ్రామాలకు చెందిన పలువురు కొయ్యబొమ్మల తయారీ నేర్చుకున్నారు.

బాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీ ఏర్పాటు

2013లో బాలాజీ వుడ్ కార్వింగ్ ఆర్టిజన్స్ మ్యూచ్‌వలీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంస్థకు అధ్యక్షుడిగా లోకనాథం ఆచారి, కార్యదర్శిగా రాజాచారి, ప్రమోటర్‌గా కృష్ణమూర్తిని నియమించుకున్నారు. అప్పటి నుంచి కళాకారులు తయారు చేసిన బొమ్మలను ఈ సొసైటీ ద్వారా దేశ, విదేశాల్లో విక్రయిస్తూ లాభార్జన గడిస్తున్నారు.

జియోట్యాగింగ్‌కు అధ్యయనం

ప్రఖ్యాతి గాంచిన మాధవమాల కొయ్యబొమ్మలకు భౌగోళిక గుర్తింపు కోసం జియోట్యాగ్‌కు అధ్యయనం జరుగుతోంది. నాబార్డు ఆధ్వర్యంలో న్యూఢిల్లీకి చెందిన రీసెల్యూట్ సంస్థ జీఐ అధ్యయనం కోసం ముందుకు వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులు బాలాజీ వుడ్ కార్వింగ్‌ను పరిశీలించి సొసైటీ ప్రతినిధులు, కళాకారులతో జీఐపై అవగాహన కల్పించారు.

అధికారికంగా గుర్తింపు లేదు



మాధవమాలలో కళాకారులు తయారు చేసిన కొయ్యబొమ్మలకు ఇప్పటివరకు అధికారిక గుర్తింపు లేదు. ప్రస్తుతం మా బొమ్మలకు భౌగోళిక గుర్తింపు తెప్పించడానికి న్యూఢిల్లీకి చెందిన సంస్థ ముందుకు రావడం సంతోషదాయకం. – లోకనాథ ఆచారి, సొసైటీ అధ్యక్షుడు, మాధవమాల, ఏర్పేడు మండలం

కల్యాణ బాలాజీ బొమ్మ ఫేమస్



మాధవమాలలో తయారు చేసిన కల్యాణ బాలాజీ కొయ్య బొమ్మను భారతదేశంలోనే ఎక్కడా తయారు చేయలేరు. ఈ బొమ్మ ప్రపంచ ఖ్యాతిని గడించింది. ఇలాంటి బొమ్మలకు భౌగోళిక గుర్తింపులేదు. – రాజాచారి, సొసైటీ కార్యదర్శి, మాధవమాల, ఏర్పేడు మండలం

నాబార్డు ద్వారా భౌగోళిక గుర్తింపు



మాధవమాలలో తయారు చేసే కొయ్యబొమ్మలకు నాబార్డు ద్వారా చేపట్టే జీఐ ట్యాగింగ్‌తో భౌగోళిక గుర్తింపు రానుంది. తద్వారా ఇక్కడ కళాకారులకు ఎంతో మేలు చేకూరనుంది, ఇది ఎంతో ఆనందంగా ఉంది. – కృష్ణమూర్తి, సొసైటీ ప్రమోటర్, మాధవమాల, ఏర్పేడు మండలం.

జీఐతో భౌగోళిక గుర్తింపు



జీఐతో సొసైటీకి భౌగోళిక గుర్తింపు రానుంది. భౌగోళిక గుర్తింపు కోసం అధ్యయనం చేస్తున్నాం. రిజిస్ట్రేషన్ ద్వారా కళాకారులకు గుర్తింపు పత్రాలు రానున్నాయి. రిజిస్ట్రేషన్‌లో సొసైటీ పేరు, గ్రామం, కళాకారులు, బొమ్మలు తదితర వివరాలను పొందు పరుస్తాం. –సుభాజిత్ సాహా, ప్రతినిధి, రీసెల్యూట్ సంస్థ, న్యూఢిల్లీ

పేటెంట్, లీగల్ హక్కు



సొసైటీని జీఐ చేయడం ద్వారా ప్రొడక్ట్‌కు పేటెంట్, లీగల్ హక్కు కలుగుతుంది. ఎవరైనా నాణ్యతలేని బొమ్మలను విక్రయిస్తే వాటిని గుర్తించి ఆపడానికి అవకాశం ఉంటుంది. భౌగోళిక గుర్తింపు వస్తే మాధవమాల టూరిజం వుడ్ హబ్‌గా ఎదుగుతుంది. – శ్రీవత్స మంగరాటి, ప్రతినిధి, రీసెల్యూట్ సంస్థ, న్యూఢిల్లీ

క్విజ్ పోటీల్లో ఏర్పేడు విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం నిర్మల్‌కుమార్

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లె హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్ మంగళవారం తెలిపారు. మంగళవారం తిరుచానూరు హైస్కూల్‌లో రెడ్‌రిబ్బన్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై క్విజ్ పోటీలు జరిగాయని చెప్పారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతికి చెందిన చెంచమ్మ ప్రథమస్థానంలో నిలిచి, ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, గుణశేఖర్‌రెడ్డి, ద్వారకానాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎస్పీ



ఎస్పీ సుబ్బరాయుడుకు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం తిరుపతిజిల్లా ఎస్పీ సుబ్బరాయుడు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వివాదాస్పద భూముల ఉమ్మడి సర్వేకు సిద్ధం



బత్తలవల్లం దళితులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజశేఖర్

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో కొద్దిరోజులుగా నెలకొన్న భూవివాద సమస్య పరిష్కారానికి అటు రెవెన్యూ, ఇటు అటవీశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఆ మేరకు ఈ నెల 5వ తేదీ నుంచి రెండు శాఖలు సంయుక్తంగా ఉమ్మడి సర్వే చేసేందుకు రికార్డులు సిద్ధం చేస్తున్నట్లు తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన అటవీశాఖ అధికారులతో కలసి వివాదాస్పద భూముల వద్ద నిరసన తెలుపుతున్న బత్తలవల్లం దళితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి సర్వే నిర్వహించి భూ సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. అప్పటివరకు గ్రామస్తులందరూ సంయమనం పాటించి, సర్వేకు సహకరించాలని కోరారు. ఆరుగురితో కూడిన సర్వే బృందాన్ని సిద్ధం చేశామని, ఉమ్మడి చిత్తూరు కలెక్టరేట్‌లో ఈ భూములకు సంబంధించి కొన్ని రికార్డులు తెప్పించాల్సి ఉందని, అవన్నీ కూడా పూర్తిస్థాయిలో సేకరించి, పకడ్బందీగా గురువారం నుంచి సర్వే మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట అటవీశాఖ ఎఫ్ఎస్ఓ, ఇతర సిబ్బంది ఉన్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం



క్షీరాభిషేకం చేస్తున్న వేదపండితుడు

శ్రీకాళహస్తిరూరల్: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం కాలభైరవస్వామివారి ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ మహాద్వారం నుంచి విజయస్థూపం వరకు ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఫ్రీహోల్డ్ సర్వే పూర్తి చేయండి



మాట్లాడుతున్న డీటీ దివాకర్

శ్రీకాళహస్తి: మండలంలో జరుగుతున్న ఫ్రీహోల్డ్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ దివాకర్ ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శ్రీకాళహస్తి మండలంలో జరుగుతున్న ఫ్రీహోల్డ్ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు సాధ్యమైనంత త్వరగా ఫ్రీహోల్డ్ సర్వే చేయాలన్నారు. సర్వే వేగవంతం చేయాలని ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ భాస్కర్ పాల్గొన్నారు.

విజయవాడకు పారిశుద్ధ్య కార్మికులు



వరదయ్యపాళెం నుంచి విజయవాడకు వెళుతున్న కార్మికులు

వరదయ్యపాళెం: విజయవాడలో వరదల కారణంగా అక్కడ పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు మండలంలోని పలు పంచాయతీల నుంచి పారిశుద్ధ్య కార్మికులను విజయవాడకు పంపామని ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ చిరంజీవి తెలిపారు. బత్తలవల్లం, వరదయ్యపాళెం, చిన్న పాండూరు పంచాయతీల నుంచి ఆరుగురు పారిశుద్ధ్య కార్మికులను విజయవాడకు పంపినట్లు తెలిపారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

రేణిగుంట: వినాయక చవితి సందర్భంగా వీధుల్లో విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని రేణిగుంట అర్బన్ సీఐ శరత్ చంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో వినాయక చవితి ఉత్సవ మండపాలు ఏర్పాటు చేయాలంటే సింగిల్ విండో విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో తీసుకొచ్చిందన్నారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోరారు. అదనపు వివరాల కోసం 9491074540, 9440796765 నంబర్లను సంప్రదించాలన్నారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ విశ్వనాథనాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులకు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్లలోని గేమ్స్‌కు అలవాటు పడితే చదువు కుంటుపడి, జీవితం నాశనం అవుతుందని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం వస్తుందని, పేదరికం దూరం అవుతుందన్నారు. చెడు స్నేహం, చెడు అలవాట్లకు బానిసలు కావద్దని, విద్యార్థి దశలో చాలా జాగ్రత్తగా వ్యవహరించి, మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు మాయమాటలు నమ్మి మోసపోకూడదని, సమస్యలుంటే తనకు తెలియజేయాలని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధిహామీ పథకంలో తమకు పనులను కల్పించాలని బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కొత్తపాళెం గ్రామానికి చెందిన కూలీలు మంగళవారం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుకు విన్నవించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలుగా ఉపాధిహామీ సిబ్బంది గ్రామంలో పనులను చేయించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. పనులు లేక పస్తులు ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌ను పనుల కోసం వేడుకున్న పట్టించుకోలేదన్నారు. పనులు లేకపోతే వలసలు తప్పవని తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ ఉపాధి పనులను కల్పిస్తానని హామీ ఇచ్చారు.

వ్యాధులపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: సీజనల్ వ్యాధులపై మండలంలోని ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వివిధ అంశాలపై ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ముఖ్యంగా రెండు రకాల వ్యాధులు వస్తాయన్నారు. కలుషిత నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడంతో టైఫాయిడ్, డయేరియా, నీళ్ల విరోచనాలు తదితర వ్యాధులు ప్రబలుతాయని, దోమలు కుట్టడడంతో మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



సరుకులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని తహసీల్దార్ సుబ్రమణ్యం సూచించారు. ఆయన మంగళవారం మధ్యాహ్నం సిబ్బందితో కలసి కనమనంబేడులోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితులలోను మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని వార్డెన్‌ను హెచ్చరించారు. , వార్డెన్ అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని చెప్పారు. అలాగే హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం స్టోరు రూమ్‌లోని సరుకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాథ్, డీటీ చంద్రబాబునాయుడు, వీఆర్ఓ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్

వరదయ్యపాళెం: రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ ఆరోపించారు. మంగళవారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం వరదయ్యపాళెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్రంలోని కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో విద్యార్థినుల స్నానపు గదుల్లో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి, చిత్రీకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తరుణ్ కుమార్, కృష్ణమూర్తి, వెంకటేష్, నాగార్జున, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ చేరిన ఫ్లెక్సీల గొడవ

శ్రీకాళహస్తి రూరల్: పట్టణంలోని కూటమి నేతలు ఫ్లెక్సీల గొడవతో మంగళవారం రెండు గ్రూపుల ఏర్పడి, కేసులు పెట్టుకునే వరకు వెళ్లింది. మొదటి నుంచి జనసేన నాయకురాలిగా కోట వినుత ఉన్నారు. అయితే ఎన్నికల సమయంలో జనసేనలోని కొట్టే సాయి వర్గం టీడీపీతో కలిసి ప్రచారం నిర్వహించగా వినుత విడిగా కూటమికి ఓట్లు వేయాలని ప్రచారం చేశారు. ఎన్నికల తరువాత జనసేన రెండు వర్గాలుగా విడిపోయింది. ఎవరికి వారు కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. పవన్ కల్యాణ్ జన్మదినం సైతం రెండు వర్గాలు వేర్వేరుగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఇన్‌ఛార్జి ఫొటో లేదని ఆగ్రహించిన ఆ వర్గం జన సైనికుడు ఫ్లెక్సీలను చించివేశారు. దీనిపై జనసేన మరో వర్గానికి చెందిన మహేష్, హుస్సేన్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఫిర్యాదు చేశారని, దానిపై కోర్టుకు విన్నవించామని వారి ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

వేడుకగా శ్రీకృష్ణుని ఊరేగింపు



ఊరేగుతున్న శ్రీకృష్ణుడు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో ఉన్న శ్రీకృష్ణ భజన మందిరంలో మంగళవారం రాత్రి కృష్ణాష్టమిని పురస్కరించుకుని రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తిని ఊరేగించారు. టీటీడీ భజన బృందం, తిరుపతి ఇస్కాన్ టెంపుల్ నుంచి హరేరామ హరేకృష్ణ భక్త బృందం వచ్చి కోలాట నృత్యాలు ప్రదర్శించారు. భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని శివం సర్కిల్ వద్ద పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ప్రమాదరకంగా మారాయి. తరచూ గాలికి రోడ్డుకు అడ్డంగా పడిపోతున్నాయి. చెన్నై నుంచి శ్రీకాళహస్తికి వచ్చే వాహనాలు అక్కడే మలుపు తిరిగి లోపలకు వస్తాయి. అలాగే ఆలయానికి సమీపంలో పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలంలో కాలువ తవ్వి, వదిలేశారు. ఈ నేపథ్యంలో కార్లు వెనక్కి వచ్చే సమయంలో అందులో పడిపోతున్నాయి. ఆలయాధికారులు దానిపై స్పందిచకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శ్రీకాళహస్తి నాలుగు మాడ వీధుల్లో భూగర్భ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. అందుకు విద్యుత్ బాక్సులను ఏర్పాటు చేశారు. అయినా అవి ప్రమాదకరమని తెలిసినా కొందరు తమ వ్యాపార సామగ్రిని వేలాడదీసి తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.